# దోబూచి

**దాదా హయత్**

"దా... దా... దా...!" అంది పాప.

చంద్రుడు రాలేదు. అక్కడే ఆకాశంలో వేలాడుతూ మబ్బుల్లో దోబూచులాడుతున్నాడు.

"దా... దా...!" అంది పాప.



పొత్తిళ్ళలో పడుకుని కాళ్ళూ చేతులూ గబగబా ఆడించింది.



"దా... దా...!"

చంద్రుడు నవ్వుతూ మబ్బు చాటుకెళ్ళాడు.

కాళ్ళూ చేతులాడించడం ఆపేసింది పాప.

బిక్కమొహం వేసింది.

తల నిక్కించడం రాక కాళ్ళతో పక్కను దభీ దభీ తన్నింది.

చంద్రుడు బయటికి రాలేదు.

మబ్బులు నడుస్తున్నాయి.

మబ్బుల్తో ఆకాశం నడుస్తోంది.

"దా...!" అంది పాప.

చంద్రుడు అప్పటికీ రాలేదు.

చుక్కలు పోటీపడి మినుకు మినుకుమంటున్నాయి.

ఎక్కడో ఉల్క రాలింది.

అది తనవైపొస్తుందా?

రాలేదు.

ఎక్కడో పడిపోయింది.

చంద్రుడు నెమ్మదిగా మబ్బు చాటునుంచి బయటికొచ్చాడు.

పాప కళ్ళలో వెన్నెల కాసింది.

ఉత్సాహంతో పాప కాళ్ళూ చేతులూ దబదబా ఆడించేసింది.

"దా... దా... దా...!"

తెల్లగా గుండ్రంగా వున్నాడు- చంద్రుడు. అమ్మలా వున్నాడు.

పాప బోసిగా నవ్వింది.

"కూచి... కూచి...," అన్నాడు చంద్రుడు ఎక్కడో కీచురాయి గొంతులో దూరిపోయి.

"దా... దా...!"

"కూచి... కూచి...!"

"దా... దా...!"

"కూచి... కూచి... కూచి... కూచి...!"

సంభాషణ సాగుతోంది.

అమ్మలాగే మాట్లాడుతున్నాడు చంద్రుడు.

పాప ఉత్సాహం అవధులు దాటింది.

కాళ్ళూ చేతులూ మహాజోరుగా ఆడించేసింది.

అమ్మ పక్కనే పడుకునుంది.

అమ్మ కొంగు చేతికందింది.

గుప్పిట్లో పట్టేసింది పాప.

మొహం మీదకి లాక్కునేసింది.

చంద్రుడు మాత్రం తక్కువ తిన్నాడా!

తనూ మబ్బు కొంగు మొహం మీదికి లాగేసుకున్నాడు.

"మ్మ... మ్మ...," పిలిచింది పాప.

అమ్మ పలక లేదు.

నిద్రపోతూనే వుంది.

పాప మొహం నిండా అమ్మ కొంగు పరుచుకుంది.

చంద్రుడి మొహం నిండా మబ్బు కొంగు పరుచుకుంది.

కొంగులో దాంకుని ఓ పక్కనుంచి దొంగ చాటుగా చూసింది పాప.

చంద్రుడు కూడా దొంగ చాటుగానే చూశాడు.

మబ్బు కొంగు పైనుంచి అలా మెడ రిక్కించి తొంగి చూశాడు.

దబదబా అమ్మ కొంగు తన్నేసింది పాప.

అమ్మ పక్కలో మెత్తగా హాయిగా వొదిగింది.

కదలకుండా చూస్తూ పడుకుంది కాసేపు.

చల్లగాలి మెల్లగా పాపబుగ్గలు పుణికి తల నిమిరి సున్నితంగా జారిపోయింది.

చంద్రుడు మళ్ళీ నెమ్మదిగా బయటికొచ్చాడు.

పాప బొజ్జలో చిన్నగా ఆకలేసింది.

మొహం చిట్లించి ఏడవబోతూ ఆగింది.

చంద్రుడు మబ్బు చాటునుంచి పూర్తిగా బయటికి వచ్చేశాడు.

ఆకలి మర్చిపోయింది పాప.

"దా... దా...!"

గాలి మళ్ళీ వచ్చి అమ్మ కొంగులా పాపను కమ్మి చెట్ల ఆకుల్లోకి రయ్యిన లేచింది. ఆకుల చాటునుంచి కొమ్మల్లోకి, కొమ్మల్లోంచి మళ్ళీ పాపకేసి వీచింది.

చెట్లన్నీ పాపకు వింజామర వీస్తున్నాయి.

ఆ వేళప్పుడు కూడా కొమ్మల చాటున కోయిల 'కూ' అంది.

చేతులు కదిలించి కోయిల పాటను గబుక్కున పట్టుకోబోయింది పాప.

పాట చేతుల్లో చిక్కలేదు.

మళ్ళీ 'కూ' అంది కోయిల.

కాళ్ళూ చేతులు దబదబా ఆడించింది పాప.

పాట మాత్రం చేతికి చిక్కలేదు.

"కూ... కూ...!"

చంద్రుడే పాడేస్తున్నాడు!

అరచేతులు విప్పి ఆకాశాన్నంతా తన గుప్పిట్లోకి తీసుకోబోయింది పాప.

ఆకాశమంతా చేతుల్లో కొచ్చింది.

చంద్రుడు మాత్రం జారిపోయాడు.

చంద్రుడితో ఆకాశం కూడా చేతుల్లోంచి జారిపోయింది.

కాలుపైకెత్తి తన్నబోయింది పాప చందమామని.

చంద్రుడు బంతిలాగయ్యాడు కానీ కాలికి తగల్లేదు. ఆకాశంలోనే ఆడుకుంటున్నాడు.

కాళ్ళూ చేతులాడించడం ఆపి చంద్రుణ్ణి తదేకంగా చూస్తుండిపోయింది పాప.

ఎదురుగానే వున్నాడు.

చేతుల్లోకి రాడు.

చిక్కనే చిక్కడు.

ఎలా?

ఎక్కడ్నించో మబ్బు మళ్ళీ నడుచుకుంటూ వచ్చింది. చంద్రుడు మళ్ళీ దాంకున్నాడు.

ఎక్కడికెళ్ళాడు వీడు? కనిపించడేం?

పాప మొహం చిన్న బోయింది.

"దా... దా...!" బిక్కమొహంతో పిలిచింది. చంద్రుడు రానే లేదు.

"దా... దా...!"

అప్పటికీ రాలేదు వాడు.

పాపకు కోపం వచ్చేసింది.

అప్పుడే బొజ్జలో ఆకలీ వేసింది.

గుక్కపట్టి ఏడ్చేసింది పాప.

పక్కలో లేచి కూర్చుండిపోయిందమ్మ.

"మా అమ్మే...! నా పాపే...!"

అమ్మ పాపను చేతుల్లోకి తీసుకుంది.

చంద్రుడిమీద కోపమంతా అమ్మ మీద చూపించేసింది పాప. గుక్కపట్టి గాట్టిగా ఏడ్చేసింది.

"నా తల్లే...! మా అమ్మే...! ఆకలేసిందా చిన్నా!" ముద్దులాడిందమ్మ.

అన్ని ముద్దులు అమ్మ అంతవరకు దాచుకున్నందుకు ఇంకా కోపం వచ్చేసింది. గోము మరీ పెరిగిపోయింది.

కేరు కేరున ఏడ్చేసింది పాప.

అమ్మ పాపను గుండెకు హత్తుకుంది.

"లేదు రాజా! ఏడవకు చిన్నా! అమ్మొందిగా!"

అమ్మ పైటకొంగు కప్పేసి పాలు పట్టేసింది.

ఏడుపు టక్కునాపేసింది పాప.

చంద్రుడు మబ్బు చాటునుంచి అప్పుడే పైకొచ్చేశాడు.

ఏదీ పాప?

ఈసారి పాపం చంద్రుడు చిన్న బోయాడు.

అమ్మ పాలు పడుతుండగానే పాప చేతులాడించి కొద్దిగా కళ్ళమీద నుంచి కొంగు తప్పించుకుంది.

పాప మొహం కొద్దిగా పైట చాటునుంచి బయటికి వచ్చింది.

చంద్రుడి మొహం పెద్దగా వెలిగిపోయింది.

కిరణాల చేతులు చాచి, "పాపా! రావా!" అన్నాడు.

చిన్ని అరచేయి అటూ ఇటూ తిప్పి రాను పొమ్మంది పాప.

"నేను పాపా! చందమామను, రావా?"

అమ్మదొరకంగానే చందమామతో ఏం పని?

పాప అసలు లక్ష్య పెట్టనే లేదు.

చంద్రుడు బతిమాలుకుంటున్నాడు.

ఇందాక పిలిచినప్పుడే రానందుకు సారీ కూడా చెప్పుకుంటున్నాడు.

పాపకళ్ళు నక్షత్రాల్లా మెరిశాయి.

చెయ్యి తిప్పి రానని టాటా చెప్పేసి మళ్ళీ అమ్మ కొంగులోకి దూరిపోయింది పాప.

చంద్రుడు పూర్తిగా చిన్నబోయాడు.

నక్షత్రాలు నవ్వాయి.

కోయిల జోలపాట మొదలెట్టింది.

అమ్మవడి పాపకు ఉయ్యాలలూపింది.




లాభం లేదనుకున్నాడు చంద్రుడు.

**దూరం నుంచి టాటా చెప్పి క్రమంగా ఎటో వెళ్ళిపోయాడు.**

**అమ్మ గుండెల్లో పాప వెచ్చగా నిద్రపోయింది.** ●